క్లుప్తంగా

ఘనంగా సీతారాముల విగ్రహాల ఊరేగింపు


సీతారాముల విగ్రహాలు ఊరేగిస్తున్న భక్తులు

గొలుగొండ: జానకిరాంపురంలో సీతారాముల విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పల్లకిలో ఉత్సవమూర్తులను ఊరేగించారు. శుక్రవారం సీతారాముల తృతీయ వార్షిక కల్యాణ వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ వేడుకల సందర్భంగా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్ రేపు

నర్సీపట్నం: న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించనున్న ఈ అదాలత్‌లో అన్ని రకాల బ్యాంకు కేసులు, విద్యుత్, నీరు, టెలిఫోన్ తగదాలు, క్రిమినల్, ట్రాఫిక్, పెట్టీ కేసులతో పాటు తదితర కేసులను పరిష్కరిస్తామన్నారు. కేసులు రాజీమార్గంలో పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గం


నర్సీపట్నం: పట్టణంలో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెట్టా ప్రభాకర్, కార్యదర్శిగా అనిమిరెడ్డి శివ కృష్ణ, ఉపాధ్యక్షుడిగా కోసూరి అప్పలనాయుడు, కోశాధికారిగా కె.వెంకటరమణ, సంయుక్త కార్యదర్శిగా ఎస్.వాసవి దత్త, లైబ్రేరియన్‌గా ఎం.వి.ఆర్. పంతులు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా వి.గోవింద, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డి.వి.రమణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీకాకుళపు వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు అభినందించారు.

ఎమ్మెల్యే దృష్టికి గ్రామీణ వైద్యుల సమస్యలు


ఎమ్మెల్యే రాజుతో ప్రైవేటు వైద్యులు

బుచ్చెయ్యపేట: గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ప్రైవేటు వైద్యుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ కోరారు. గురువారం బుచ్చెయ్యపేట మండలానికి చెందిన ప్రైవేటు వైద్యులు, ఆర్ఎంపీలు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబులను కలిశారు. తాము దీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.బెన్నబాబు, వైద్యులు పెంటబాబు, ప్రసాద్, వామనమూర్తి, నూకరాజు, దొర పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 50 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,970	5,240
రెండో రకం	4,240	4,240
మూడోరకం	3,250	3,860

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

జోరుగా కురుస్తున్న వర్షాలు

- పొంగి ప్రవహిస్తున్న నదులు
- చెరువుల్లో జలకళ


రోలుగుంటలో కురుస్తున్న వర్షం

రోలుగుంట: పది రోజులుగా అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. మండలంలో రోలుగుంట, కొమరవోలు, కంచుగుమల తదితర గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వర్షం పడుతూనే ఉంది. దీంతో ప్రతి గ్రామంలో చెరువులు జలకళ సంతరించుకుంది. పొలాల్లో నీరు చేరింది. మండలం రైతాంగం వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ పురస్కరించుకొని వరి సాగు కోసం దుక్కులు చేసుకుని ఆకు నారుమడుల సిద్ధం చేసుకున్నారు. వారి కోరిన వరి విత్తనాల రిజిస్ట్రేషన్లు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి పర్యవేక్షణలో వేగవంతమయ్యాయి. విత్తన పంపిణీ కూడా చేయనున్నట్లు ఆమె తెలిపారు. సొంతంగా విత్తనాలు కట్టుకున్న రైతులు రోలుగుంట వరకట్టు ప్రాంతంలో గురువారం ఆకుపోత పనులు చేపట్టారు. ఆకుపోత పనులు చేపట్టినపుడు ముందుగా మొలక కట్టుకోవాలని, ఆశాజనకంగా ఉన్నట్టు నిర్ధారించుకుని ఆకు పోసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు.

మోస్తరు వర్షం..

నర్సీపట్నం: అల్పపీడన ప్రభావంతో నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా జల్లులతో కూడిన వర్షం పడింది. కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులకు మేలు చేకూరుతుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కురిసిన వర్షానికి ముసురుతో కడిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ పనుల మీద బయటకు వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. నర్సీపట్నం డివిజన్‌లో నమోదైన వర్ష పాతం వివరాలు ఇలా వున్నాయి. నాతవరం 8.6, గొలుగొండ 16.0, నర్సీపట్నం 11.4, రోలుగుంట 19.6, రావికమతం 32.8, మాడుగుల 35.2, చీడికాడ 51.2, కోటవురట్ల 13.4, మాకవరపాలెం 16.2, నక్కపల్లి 10.4, పాయకరావుపేట 4.6, ఎస్.రాయవరం 3.2 మి.మీ వర్షం నమోదైంది.

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అవర్తన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు వల్ల తాచేరు, పెద్దేరు, శారద, నదుల్లో వర్షపు నీరు చేరింది. దీంతోపాటు తారకరామ జలాశయంలో నీరు చేరింది. బుధవారం సాయంత్రం కుండపోతగా కురిసిన వర్షంతో గ్రామాల్లో రైతులు ఖరీఫ్ వరినారు మడులు సిద్ధం చేస్తున్నారు. కొన్ని చోట్ల గురువారం వరి విత్తనాలు వేశారు. ఈ వర్షంతో మెట్ట భూముల్లో సరుగుడు, టేకు, పామాయిల్ తోటలు వేస్తున్నారు. దీంతోపాటు చెరకు నాట్లు వేస్తున్నారు.

వాహనదారుల అవస్థలు

బుచ్చెయ్యపేట: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరుతోంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రోజువారీ కూలీలు, ప్రయాణికులు, వ్యాపారులు వానకు తడిచి అవస్థలు పడుతున్నారు. ఈ వర్షానికి పెద్దేరు, తాచేరు, బొడ్డేరు నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. పెద్దేరు రిజర్వాయర్ నుంచి నీటిపారుదల శాఖ అధికారులు గేట్లు ఎత్తి నీరు విడుదల చేయడంతో వడ్డాది డైవర్షన్ రోడ్డును ఆనుకుని వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అన్ని గ్రామాల్లోని పొలాల్లో వర్షం నీరు చేరడంతో పలువురు రైతులు వరి ఆకుపోతలు వేయడానికి సిద్ధమయ్యారు. పలు గ్రామాల్లో రోడ్లపై వర్షం నీరు చేరుతోంది. లోతట్టు ప్రాంతాల్లో, గోతుల్లో చేరిన వర్షం నీటిలో నుంచి రాకపోకలు సాగించడానికి వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. జోరు వానలతో వాతావరణం చల్లబడి వేసవి ఎండలు, ఉక్కపోత నుంచి ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. అడుగంటిన భూగర్భ జలాలు పెరుగుతాయని, తాగునీటి ఇబ్బందులు ఉండవని అధికారులు తెలియజేస్తున్నారు.


తాచేరు నదిలో చేరిన వర్షపు నీరు


ముకుందపురంలో వేసిన వరినారు


విజయరామరాజుపేట, వడ్డాది ఆర్అండ్‌బీ రోడ్డు గోతుల్లో చేరిన వర్షం నీరు


పొలాల్లో చేరిన వర్షపు నీరు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచండి

డిప్యూటీ డీఈవో అప్పారావు హెచ్ఎంలకు ఆదేశం


హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

రోలుగుంట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల రోల్ పెంచాలని హెచ్ఎంలను డిప్యూటీ డీఈవో అప్పారావు ఆదేశించారు. స్థానిక ఎమ్మార్సీ భవన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఎంఈవో -1, 2 జానుప్రసాద్, జగ్గారావులను కలిసి మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల రోలు, వ్యత్యాసం గురించి ఆరా తీశారు. పాఠ్య పుస్తకాలు పంపిణీ గురించి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమీక్షించారు. పాఠశాలల వారీగా విద్యార్థులు రోలు, ఉపాధ్యాయుల బోధన పరిస్థితులపై చర్చించారు. గ్రామాల్లో ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమాలు, ఉత్తమ బోధన, సాధిస్తున్న ఫలితాలు తదితర అంశాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో రోలును పెంచే బాధ్యత హెచ్ఎంలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలను ఎంఈవోలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

విద్యార్థులకు డైరీల అందజేత


డైరీలు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు, హెచ్ఎం

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాసవీ క్లబ్ వీ216ఏ ప్రతినిధులు పి.ఎస్.వరహాలరావు, వై.నర్సింగరావు, ఎస్.శ్రీనుల డైరీలు పంపిణీ చేశారు. వీటిని గురువారం పాఠశాల సందర్శనకు వచ్చిన డిప్యూటీ డీఈవో అప్పారావుతో హెచ్ఎం ప్రసాదరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు డైరీల ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వీటి ద్వారా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తమ పిల్లల విద్యా ప్రగతి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. డైరీని రూపొందించిన దాతలను హెచ్ఎం అభినందించారు. ఉపాధ్యాయులు ఆర్.వి.ఎస్.ఆర్.శర్మ, రమాదేవి, కిరణ్, నాని పాల్గొన్నారు.

పాఠశాలలో అంగన్‌వాడీ చిన్నారుల చేరిక


పాఠశాలలో చిన్నారులను చేర్పిస్తున్న కార్యకర్త వరలక్ష్మి

రోలుగుంట: కంచుగుమల ఎంపీపీ పాఠశాలలో బడిఈడు చిన్నారులను అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మి చేర్పించారు. ప్రధానోపాధ్యాయుడు కె.నాయుడుబాబు వారి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు గ్రామంలో బడిఈడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ సంక్షేమాలు పొందాలని చిన్నారుల తల్లిదండ్రులను కోరారు. ఈ మేరకు వారి ఇళ్లకు వెళ్లి చైతన్యపరుస్తున్నారు.

78 గ్రామాల్లో రెండో విడత వ్యవసాయ గణన

నర్సీపట్నం డివిజన్ ఉప గణాంక అధికారి బానోజీ


మాట్లాడుతున్న ఉప గణాంక అధికారి బానోజీ, పక్కన తహసీల్దార్ రమేష్‌కుమార్

నాతవరం: నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లో రెండో విడత కింద 78 రెవెన్యూ గ్రామాల్లో వ్యవసాయ గణన చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని నర్సీపట్నం ఉప గణాంక అధికారి పి.బానోజీ తెలిపారు. తహసీల్దార్ ఎన్. రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలకు వ్యవసాయ గణనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఏఎస్‌వో ఉలబాల రాజుబాబు ఆధ్వర్యంలో వీఆర్వోలు వ్యవసాయ గణన వచ్చే నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. రైతులు సాగు చేసే పంటల వివరాలతోపాటు భూమి కమతం తదితర వివరాలను క్షుప్తంగా నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సేకరించిన పంటల సాగు విస్తీర్ణం, తదితర అంశాలను ఆన్‌లైన్లో అప్‌లోడు చేయాలన్నారు. గతంలో గణన సర్వే రికార్డులో నమోదు చేసేవారమని, ప్రస్తుతం టెక్నాలజీకి అనుగుణంగా మార్పు చేశారన్నారు. గణన సర్వే తప్పులుగా నమోదు చేస్తే వచ్చే నష్టాలను శిక్షణ తరగతుల్లో రెవెన్యూ సిబ్బందికి వివరించారు. నాతవరం మండలంలో వ్యవసాయ గణన రెండో విడత కింద ఎనిమిది రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేశామన్నారు. డివిజన్‌లో రెండో విడత గణన పూర్తి చేశాక మూడో విడత కింద ఎంపికైన 28 గ్రామాల్లో వ్యవసాయ గణన చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్. సురేష్, సీనియర్ అసిస్టెంటు కృష్ణ, ఆర్ఐ హరి, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

రోలుగుంట: మండలంలోని 11 కేవీ కొమరవోలు ఫీడర్ విద్యుత్ లైను మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ వి.డి.వి. రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శరభవరం, కొంతలం, భోగాపురం, కొమరవోలు, కె.నాయుడుపాలెం, కొవ్వూరు, అంట్లపాలెం, కంచుగుమల, కొండపాలెం, పడాలపాలెం గ్రామాల్లో ఈ అసౌకర్యం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

1 నుంచి పెంచిన పింఛన్ల నగదు బట్వాడా


ఎంపీడీవో కాళీప్రసాదురావు

మాడుగుల రూరల్: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు గ్రామాల్లో సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని ఎంపీడీవో ఆర్. కాళీప్రసాదురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు సామాజిక పింఛన్ గతంలో రూ.3 వేలు ఉండగా, రూ.4 వేలకు పెంచామన్నారు. దివ్యాంగుల పింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, కుష్టువ్యాధిగ్రస్తులకు రూ.6 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలకు, కిడ్నీ, లివర్, గుండె మార్పిడి, డయాలసిస్, తదితర వ్యాధిగ్రస్తులకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచామని, వీటిని జూలై ఒకటి నుంచి అందిస్తామన్నారు. సైనిక సంక్షేమ పింఛను కింద రూ.5 వేలు, అభయహస్తం రూ.500 పింఛను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు.

సినిమా టికెట్ల ధరల పెంపు తగదు

అనకాపల్లి: భారీ బడ్జెట్ పేరిట సినిమా ధరల్ని విపరీతంగా పెంచడం సరికాదని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ ఆక్షేపించారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో గురువారం ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో సినిమా టికెట్స్ ధరల అడ్డగోలు పెంపు లేదని, ప్రస్తుత ప్రభుత్వం సామాన్యులు దోపిడీకి గురయ్యేలా ఇష్టారీతిన పెంపునకు అనుమతివ్వడం అన్యాయమన్నారు. తాజాగా పెంచిన కల్కి సినిమా ధరల్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.

8న వైఎస్సార్ జయంతి వేడుకలు


పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: దివంగత మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలను వచ్చే నెల 8న గ్రామ స్థాయి నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జయంతి వేడుకల్లో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనేలా క్షేత్రస్థాయిలో సన్నాహాలు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ఎల్లప్పుడూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనకాపల్లి, కశింకోట మండల పార్టీ అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, పార్టీ నాయకులు జాజుల రమేష్, బొడ్డేడ లక్ష్మీనారాయణ, కె.ఎం.నాయుడు, మూనూరు శ్రీనివాసరావు, గైపూర్ రాజు, భీశెట్టి జగన్, బుద్ధ రాజు, దాడి కుమార్, ఏడువాకల నారాయణరావు, బొండా అప్పలరాజు పాల్గొన్నారు.

చోడవరానికి బస్సు సౌకర్యం కల్పించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న డిమాండ్


సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

దేవరాపల్లి: చోడవరానికి బస్సు సౌకర్యం మెరుగుపర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చోడవరంలో విద్యాలయాలు, ఆస్పత్రులు, కోర్టు, ట్రెజరరీ తదితర సంస్థలు ఉన్నాయని, వీటి నిమిత్తం వెళ్లేందుకు దేవరాపల్లి, చీడికాడ, వి.మాడుగుల, కె.కోటపాడు మండలాల నుంచి బస్సులు నడపాలని కోరారు. చోడవరంలో డిగ్రీ తదితర ఉన్నత చదువులకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లి నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌తో కూడిన కాలేజీలు లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో నిరుపేద విద్యార్థులు కార్పొరేట్ విద్యా సంస్థలకు లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించి చేరాల్సి వస్తుందన్నారు. దేవరాపల్లిలో హాస్టల్‌తో కూడిన డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని కేజీబీవీల్లో సీట్లు సంఖ్య పెంచి, భవనాలను సైతం నిర్మించాలన్నారు. రెండు నియోజకవర్గంలో అత్యధికంగా గిరిజన గ్రామాలు ఉన్నప్పటికీ ప్రత్యేక గిరిజన పాఠశాలలు లేకపోవడంతో చదువులకు దూరమవుతున్నారని వాపోయారు. దళిత గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. జిల్లాలోనే అత్యంత వెనుకబడ్డ నియోజకవర్గలైన చోడవరం, మాడుగుల అభివృద్ధిపై నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ


పైడిపాలలో రైతులకు విత్తనాలు అందిస్తున్న నేతలు


తురకలపూడిలో విత్తనాలు అందిస్తున్న నాయకులు

మాకవరపాలెం: పైడిపాల సచివాలయం వద్ద గురువారం రైతులకు రాయితీ వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రుత్తల జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 85 టన్నుల విత్తనాలను పంపిణీకి సిద్ధం చేశామని ఏవో చిరంజీవి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేత సిద్దాబత్తుల శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తురకలపూడిలో...

బుచ్చెయ్యపేట: మండలంలో తురకలపూడిలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. గురువారం ఉదయం నుంచి రైతు భరోసా కేంద్రం వద్ద గ్రామ రైతులకు రైతు సంఘ నాయకులు, అధికారులు విత్తనాలు అందించారు. స్వర్ణ, ఆర్జీఎల్, సాంబమసూరి, సోనామసూరి తదితర రకాల విత్తనాలను రైతులు కొనుగోలు చేశారు. అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద సబ్సిడీపై అందిస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసికోవాలని ఏవో భాస్కరరావు తెలిపారు.

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపు


మాట్లాడుతున్న ఎంఈవో తలుపులు

నర్సీపట్నం: విద్యార్థుల్లో పఠన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు హెచ్ఎంలు బాధ్యత తీసుకోవాలని ఎంఈవోలు సిహెచ్. తలుపులు, నాగేంద్ర సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థుల కనీస సామర్థ్యం మదింపు పరీక్షలు నిర్వహించి వారి స్థాయికి అనుగుణంగా బోధన జరిగేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. స్టూడెంట్ కిట్లు, పాఠ్య పుస్తకాలు వెనువెంటనే పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం అందించిన స్మార్ట్ టీవీలు, ఐఎఫ్పీలు ఉపయోగించి బోధన చేయాలన్నారు. రక్తహీనత కలిగిన పిల్లలకు ఐరన్ టాబ్లెట్స్ ఎప్పటికప్పుడు పంపిణీ చేయాలన్నారు. వర్షాలు ఎక్కువగా పడుతున్న కారణంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గ్రామాల్లో ఘనంగా అమ్మవార్ల పండగలు


మరిడిమాంబ ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు


చౌడువాడలో మల్లిలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు: మండలంలోని నాలుగు గ్రామాల్లో గురువారం గ్రామదేవతల పండగలను ఘనంగా నిర్వహించారు. గుల్లేపల్లిలో మరిడిమాంబ, చౌడువాడలో మల్లిలమ్మ, ఆర్.వై.అగ్రహారం, యడ్లవానిపాలెం గ్రామాల్లో బంగారమ్మ అమ్మవార్ల పండగలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సంప్రదాయబద్ధంగా ఈ పండగలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బంధువులు, స్నేహితుల రాకతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది. నాలుగు గ్రామాల్లో ఉదయం నుంచే అమ్మవార్లకు పూజలు చేసేందుకు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రజల మన్ననలు పొందేలా సేవలు

నర్సీపట్నం రూరల్ సీఐ హరి


ఏఎస్ఐ బంగార్రాజు దంపతులను సత్కరిస్తున్న సీఐ హరి, ఎస్ఐలు రామారావు, కృష్ణారావు

నాతవరం: సమాజంలో ప్రజలు మన్ననలు పొందే విధంగా ప్రతి ఉద్యోగి సేవలు అందించాలని నర్సీపట్నం రూరల్ సీఐ హరి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న బి.బంగార్రాజు పదవీ విరమణ సందర్భంగా బుధవారం రాత్రి వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమన్నారు. ఉద్యోగం చేసేటప్పుడు ప్రజలకు అందించే సేవలను బట్టి సమాజంలో ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందన్నారు. బంగార్రాజు అందించిన సేవలు గురించి పలువురు చెబుతుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. ఇదే విధంగా మిగతా ఉద్యోగులు అందించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఎస్ఐ రామారావు మాట్లాడుతూ ఏఎస్ఐ బంగార్రాజు తక్కువ సమయంలోనే మండలంలో ప్రజల మన్ననలు పొందారన్నారు. చాలా గ్రామాల్లో అభిమానం, ఆప్యాయత చూపిస్తున్నారన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదారుల పట్ల స్నేహ పూర్వకంగా మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపేవారన్నారు. అనంతరం గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు, పోలీసు సిబ్బందితో కలిసి బంగార్రాజు దంపతులను ఘనంగా సత్కరించారు.

తగ్గిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర తగ్గింది. గత వారం కిలో రూ.80 ఉండగా, ఈ వారం కిలో రూ.60కి విక్రయాలు సాగాయి. ఇక ఎప్పటిలాగే ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, దొండకాయలు, బెండకాయలు, వంకాయలు రూ.40, బీట్రూట్, క్యారెట్, చేమదుంప రూ.60, కాకరకాయ రూ.80, క్యాప్సికం రూ.100కు విక్రయాలు సాగాయి.